క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి



పెనమలూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తాడిగడప మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్ అన్నారు. తాడిగడప గ్రామంలో మంగళవారం గ్రీన్ సిటీ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. పచ్చదనం, పరిశుభ్రతకు మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుదని తెలిపారు. గ్రీన్‌సిటీ కాలనీ కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ తమ కాలనీ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శేషగిరిరావు, గౌరవ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు నాగరాజు, సహాయ కార్యదర్శి మాధవరావు, సభ్యులు కృష్ణపరమాత్మ, సురేష్, నాంచారయ్య, కృష్ణప్రసాద్, కిషోర్, శరత్ పలువురు పాల్గొన్నారు.

వర్గీకరణకు అనుగుణంగా ఉద్యోగోన్నతులు చేపట్టాలి



ఆర్.వరుణ్‌కుమార్

కంకిపాడు: ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అనంతరం ఏ, బీ, సీ గ్రూపుల ప్రకారం కొత్తగా 15 శాతం అమలు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.వరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కంకిపాడులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌లో భాగంగా ఉపాధ్యాయుల పదోన్నతులు ఎస్సీ కేటగిరి ఉపాధ్యాయులకు జీఓ 7, జీఓ 46 ప్రకారం చేపట్టాలన్నారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఖాళీలను వర్గీకరణ ఉత్తర్వుల ప్రకారం భర్తీ చేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు.

ఐక్యపోరాటాలతోనే రాజ్యాధికారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాధికారం కోసం ఐక్య పోరాటాల చేయాల్సిన అవసరం ఉందని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్‌పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జె. పూర్ణచంద్రరావు అన్నారు. హనుమాన్‌పేటలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆధిపత్య ధోరణిని ఎదుర్కోవాలంటే బహుజనులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. శాసనసభలో బహుజనులకు తగిన ప్రాధాన్యత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని, బీసీల సంరక్షణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, స్టేట్ కోఆర్డినేటర్ బి.పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలకు నిప్పు.. పొగతో ముప్పు

- కమ్ముకుంటున్న కాలుష్యం
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఈడుపుగల్లులో వరి పొలంలో పెట్టిన నిప్పు



ఉప్పలూరు రోడ్డు మార్గంలో కమ్మేసిన పొగ

కంకిపాడు: పొలాల్లో వ్యర్థాలకు పెడుతున్న నిప్పుతో కాలుష్యం కమ్ముకుంటోంది. వ్యర్థాల నుంచి వస్తున్న పొగ గ్రామాలకు వ్యాపించడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రహదారులను పొగ కమ్మేయటంతో రాకపోకలకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవటంపై ప్రజలు విస్మయం చెందుతున్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం..

పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా 42 వేల ఎకరాల్లో ఖరీఫ్‌కు అనువైన సాగు భూమి ఉంది. రబీలో వరి, మొక్కజొన్న, మినుము, పెసలు, ఇతర కూరగాయ పంటలను రైతులు సాగు చేసుకున్నారు. రబీ పంట కాలం ముగియటంతో పాటు రుతుపవనాల ప్రవేశంతో రైతాంగం ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతోంది. దీంతో పంట పొలాల్లో పూర్వ పంట తాలూకా వ్యర్థాలను తొలగించి భూమిని దమ్ము చేసి, వరి నారుమడులు పోసుకునేందుకు వీలుగా రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

వ్యర్థాలకు నిప్పు..

ఈ క్రమంలో వ్యర్థాలను వేర్లతో సహా తొలగించటం చేందుకు దుక్కిదున్నగా మిగిలిన వ్యర్థాలను పొలం మీదే ఉంచి రైతులు నిప్పు పెడుతున్నారు. తద్వారా పొలం శుభ్రం అవుతుందని, అంతేకాకుండా వేర్ల వద్ద ఉండే శిలీంద్రాలు, పురుగులు నశించి తదుపరి పంటకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. అయితే వ్యర్థాలకు నిప్పు పెట్టే విషయంలో రైతులు వేళాపాళా లేకుండా, కనీసం వ్యర్థాలను గుట్టగా వేయకుండా పొలంలో యథేచ్ఛగా పరిచి తగలబెడుతున్నారు. దీంతో పంట పొలాలకు ఆనుకుని ఉన్న గ్రామాలు, రహదారులను పొగ కమ్మేసుకుంటోంది. ఇళ్లల్లోకి పొగ ప్రవేశించి ఊపిరాడక జనం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రహదారులపై పొగ కమ్మి రాకపోకలు సాగక, ఎదుటి వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారంటే సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకోని అధికారులు..

వ్యర్థాలకు నిప్పు పెట్టడం ద్వారా కమ్ముకుంటున్న పొగతో వాతావరణం కలుషితం అవుతోంది. పొగచూరి గ్రామాల్లో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక సంస్థల అధికారులు ఏ ఒక్కరూ స్పందించటం లేదు. వ్యర్థాలను కలియదున్ని కుళ్లబెట్టడం ద్వారా భూమికి మేలు చేకూరుతుందనే విషయంపైనా అవగాహన కల్పించటం లేదు. యథేచ్ఛగా పొలాలకు నిప్పు పెట్టడం ద్వారా తలెత్తుతున్న ప్రజారోగ్య సమస్యలపై కనీసం స్పందించటం లేదు. రోడ్లపై పొగతో ఎదుటి వాహనాలు కనిపించక ప్రమాదాలు జరగటం, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా రవాణ, పోలీసుశాఖలు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రజారోగ్యం, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తగలబెట్టొద్దని చెప్పాం

రబీ పంట వ్యర్థాలను తగలబెట్టొద్దని చెప్పాం. గ్రామస్థాయిలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. రబీ సాగు పూర్తయిన నాటి నుంచి సదస్సులు కూడా నిర్వహించాం. వాతావరణం కలుషితం అవుతుందనే కారణంతో రైతులకు సూచనలు ఇచ్చాం. రైతులు వ్యర్థాలను తగలబెట్టే యోచన విరమించుకోవాలి.

– బి.స్వర్ణలత, ఏడీఏ, పామర్రు

దోమల నివారణకు చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. దోమలకు నిలయాలుగా మారిన గ్రామంలోని పలు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లను మంగళవారం పూడికతీయించి బ్లీచింగ్ చల్లించామన్నారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ పారుదలకు నోచుకోని డ్రెయిన్లను, చెత్త డంపింగ్ చేసే ప్రాంతాలను పరిశీలించి తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గ్రామంలోని ఖాళీ స్థలాలను గుర్తించి చెత్త డంప్ చేయకుండా, మురుగు నిల్వ లేకుండా మెరక తోలించుకోవాలని యజమానులకు సూచిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు కూడా తమ నివాస పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త రోడ్లపై డంప్ చేయకుండా ఉండేందుకు సహకరించాలని కోరారు. దోమల నివారణకు డ్రెయిన్లలో త్వరలో ఆయిల్ బాల్స్ వేయిస్తామని తెలిపారు.

ఆలయంలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు తవ్వా జగదీష్ వీర వెంకట ప్రవీణ్, శ్రావణి లక్ష్మి దంపతుల సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉపాధి పనికి రాజకీయ గ్రహణం

పంటబోదెలో స్వచ్ఛందంగా పూడిక తీయించుకుంటున్న రైతులు



రైతుల సొంత నిధులతో కొత్త కాలువ పంట బోదేలో పూడిక తీస్తున్న దృశ్యం

ఉయ్యూరు రూరల్: ఉపాధి హామీ పనులకు రాజకీయ గ్రహణం పట్టింది. పంట పొలాల్లో బోదేలు తీసేందుకు ప్రతి ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా విధిగా పనులు చేయించాల్సి ఉండగా రాజకీయ కోణంతో కొందరు విధులు నిర్వహిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విషయం ఇదీ..

మండలంలోని చిన్న ఓగిరాల గ్రామంలో కొత్త కాలువ నుంచి సాగునీరు పొలాలకు అందించేందుకు పంట బోదే ఉంది. ఆ బోదే పూడిక తీసి సాగునీరు అందించేందుకు ప్రతి ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా పనిని గుర్తించి విధిగా కూలీలతో పని చేయించి సాగునీరు సక్రమంగా గ్రామ, మండల స్థాయి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది పనిని గుర్తించినప్పటికీ ఐడీ ఉన్నప్పటికీ గ్రామ పరిధిలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొడాలి నవీన్ విధి నిర్వహణకు విరుద్ధంగా రాజకీయ కోణంతో పూడిక పనులు చేయించకుండా తాత్సారం చేస్తున్నారు. దీంతో పలువురు రైతులు ఇదే మన ప్రశ్నించగా అధికారులు ఇంకా వర్కు ఇవ్వలేదని, తాను చేయించనని చెప్పడంతో ఆ ప్రాంత రైతులు సొంత నిధులు వెచ్చించి రోజువారీ కూలీలతో కాలువ పూడికతీత పనులు చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

అధికారులకు వినతి..

దీనిపై ఉపాధి హామీ పథకం జిల్లా స్థాయి అధికారులకు, మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేశామని పలువురు రైతులు తెలిపారు. కేవలం ఫీల్డ్ అసిస్టెంట్ రాజకీయ దురుద్దేశంతోనే వైఎస్సార్ సీపీకి చెందిన రైతు పొలం పక్కన పంట కాలువ పూడిక తీయించటం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అన్నదాతల మేలుకోసం ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ బేబీ సరోజిని



కానూరులో మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఉయ్యూరు రూరల్: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతపై కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ కంకిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని సూచించారు. కిశోర వికాసం శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉయ్యూరు పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లోనూ 8వ సెషన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఉయ్యాల స్తంభాల సెంటర్ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బేబీ సరోజిని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన లేకపోవడంతో యువతీ యువకులు అనేక ఇబ్బందులు పడుతూ సమస్యల వలయాల్లో చిక్కుకుంటున్నారన్నారు. ఇలాంటి భద్రత అంశాలపై ఎప్పటికప్పుడు అవగాహనతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కోరాడ వెంకటలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఝాన్సి, అంగన్‌వాడీ కార్యకర్తలు లీలా సత్యవతి రమణ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: సైబర్ నేరాల పట్ల కిశోర బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. కానూరులో మంగళవారం కిశోర వికాసం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో తెలియని వ్యక్తులతో మాట్లాడరాదన్నారు. వణుకూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన భద్రత అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి డి.వికల్ప మాట్లాడుతూ డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, అక్రమ రవణా ఇలా అనేక మోసాలు జరుగుతున్నాయని, వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం చేయాలి



వణుకూరులో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి భారతి



పురుషోత్తపట్నంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



కంకిపాడు గ్రంథాలయంలో ఆసక్తిగా కథలు వింటున్న చిన్నారులు

పెనమలూరు: విద్యార్థులు పుస్తక పఠనం పట్ల శ్రద్ధ చూపాలని వణుకూరు గ్రంథాలయ అధికారి భారతి అన్నారు. వణుకూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే విజ్ఞానం కలుగుతుందన్నారు. గ్రంథాలయాలలో విజ్ఞానాన్ని అందించే అనేక పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులతో కథలు చెప్పించి, ఆటలు ఆడించి, పాటలు పాడించారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో మంగళవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, వ్యాకరణంపై తరగతులు నిర్వహించారు. తరగతి గది, స్నేహితులో సరళమైన ఆంగ్లంలో మాట్లాడే వాఖ్యలను విద్యార్థులకు నేర్పించారు. అనంతరం ఆంగ్ల కథల పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. మాతృభాషతో పాటుగా ఆంగ్లంపై కూడా విద్యార్థులు పట్టు సాధించాలని గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి సూచించారు. అనంతరం విద్యార్థులలో ఇండోర్ గేమ్స్ ఆడించారు.

పుస్తక పఠనంతో ఉత్తమ భవిష్యత్

గన్నవరం రూరల్: పుస్తక పఠనం విద్యార్థులు ఉన్నతికి దోహదం చేస్తుందని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. మంగళవారం సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం పోటీలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి నిరంతరం పుస్తకాలు చదివి ప్రగతి సాధించాలన్నారు. పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు ఆటల పోటీలు నిర్వహించారు. మెదడుకు పదునుపెట్టే చెస్, క్యారమ్స్ వంటి ఆటలు ఆడించారు. పాఠకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఆసక్తిగల కథలు వినిపించారు. పోటీలను గడ్డం దీపిక నిర్వహించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో చంద్రగహణం, సూర్య గ్రహణం ఏర్పడటం, వాటి వల్ల కలిగే ప్రభావాలను వివరించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత, మల్లిక పర్యవేక్షించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాల శిక్షణలో మాస్టర్ ట్రైనర్ రామలింగేశ్వరరావు



పెనమలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రణవి

విజయవాడరూరల్: యోగాసనాలు ప్రతి మనిషి ఆరోగ్యంగా జీవించడానికి ఎంతో దోహదం చేస్తాయని యోగా మాస్టర్ ట్రైనర్ రామలింగేశ్వరరావు సూచించారు. మంగళవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం సిబ్బందికి ఒక రోజు యోగసనాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ సచివాలయ సిబ్బందితో కలిసి యోగాసనాలను ప్రాక్టీస్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాలతో రుగ్మతలు దూరమై ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. డీఎల్‌డీఓ నిర్మల జ్యోతి మాట్లాడుతూ బుధవారం నుంచి మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో యోగాసనాలు చేయించాలన్నారు. శిక్షణ పొందిన ప్రతి ఉద్యోగి 50 మంది స్థానికులను యోగాసనాలలో భాగస్వాములను చేయాలన్నారు. ఎంపీడీఓ బి.విగ్గిన్స్ మాట్లాడుతూ జీవితంలో యోగాసనం భాగం కావాలన్నారు. వచ్చే నెల 21వ తేదీ వరకు ప్రతి గ్రామంలో యోగాసనాలను నిర్వహించాలని తెలిపారు.

యోగాపై మండల పరిషత్‌లో శిక్షణ

పెనమలూరు: యోగాంధ్రలో భాగంగా పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఐదు రోజులు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని మండల అభివృద్ధి అధికారి బండి ప్రణవి అన్నారు. ఈ సందర్భంగా పెనమలూరు గ్రామంలో యోగాంధ్రపై మంగళవారం ర్యాలీ నిర్వహించి శిక్షణ తరగతులు ప్రారంభిం చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో యోగాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. యోగా పై ఆసక్తి కలిగిన వారు మండల పరషత్‌లో ప్రాంరభమైన శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాంధ్ర శిక్షణ


గన్నవరం రూరల్: యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో టి.స్వర్ణలత పిలుపునిచ్చారు. మంగళవారం గన్నవరం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అనుబంధంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. యోగాంధ్ర శిక్షణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ట్రైనీ డి.నాగరాజు శిక్షణలో యోగా నేర్పించారు. మండలంలోని సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫిజికల్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొన్న వారు ఆయా సచివాలయాల పరిధిలో శిక్షణ కొనసాగిస్తారని ఎంపీడీవో వివరించారు.

యోగాంధ్ర ర్యాలీ


కంకిపాడు: పట్టణంలో మంగళవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన తహసీల్దార్ కార్యాలయం మీదుగా బస్టాండు సెంటరు వరకూ సాగింది. అనంతరం గన్నవరం రోడ్డు కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాపై అవగాహన కల్పిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ బసవయ్య పర్యవేక్షించారు.

యోగాతోనే ఒత్తిడిని జయించగలం


హనుమాన్‌జంక్షన్ రూరల్: యోగా సాధనతో మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని లయన్స్‌క్లబ్ హాల్‌లో యోగాంధ్ర-2025 మాస్టర్స్ ట్రైనర్స్ ఐదురోజుల శిక్షణ కార్యాక్రమం మంగళవారం ప్రారంభించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు యోగా శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుత బీజీ జీవితంలో మానసిక ఒత్తిడి వల్ల అనేక అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అధిగమించేందుకు యోగా సాధన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



యోగాంధ్ర శిక్షణలో ఎంపీడీవో స్వర్ణలత



కంకిపాడు ప్రధాన సెంటరులో మానవహారంగా అధికారులు, నేతలు



యోగా సాధన చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో అటెండర్ మృతి



బి.సుబ్బారావు (ఫైల్)

గన్నవరం రూరల్: మండలంలోని గోపవరపుగూడెం గ్రామానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి బి.సుబ్బారావు (58) మంగళవారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఏలూరు జిల్లా నూజివీడు ఆర్డీవో కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న సుబ్బారావు స్వగ్రామం నుంచి నూజివీడుకు వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. దీర్ఘకాలం గన్నవరం తహసీల్దారు కార్యాలయంలో పని చేశారు. అందరికి సుపరిచితుడిగా ఉన్నారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన స్వగ్రామం గోపవరపుగూడెంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాన్ని ఏపీజీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహనరావు, సర్పంచ్ నల్లూరి వెంకటేశ్వరరావు, వీఆర్వో కోటగిరి గోపాలరావు, నల్లూరు వెంకటరత్నం, వేమూరి రవి, రెవెన్యూ ఉద్యోగులు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

దళిత మైనార్టీ యువకులపై దాడి హేయం

వడిత్యా శంకర్ నాయక్

మధురానగర్(విజయవాడసెంట్రల్): తెనాలిలో దళిత మైనార్టీ యువకులపై జరిగిన పోలీసుల దాడి హేయమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ పేర్కొన్నారు. ఈ ఘటనను మానవ హక్కుల కమిషన్, ఎస్సీ కమిషన్ సుమోటోగా స్వీకరించి సదరు పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలను రక్షించాల్సిన పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించి దళిత యువకులపై బహిరంగంగా, దాడి చేయటం విచారకరమని పేర్కొన్నారు. దీనికి బాధ్యులైన పోలీసు అధికారులను విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. పోలీసులు కనీసం విచారణ చేయకుండా యువకులపై రౌడీల మాదిరిగా దాడి చేయటం ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గు చేటని విమర్శించారు. ఎవరైనా తప్పులు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టచేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

నైనవరం వరకు బస్సు సర్వీసులను పొడిగించాలి

విజయవాడరూరల్: జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి నడిచే ఆర్టీసీ బస్సులను పి.నైనవరం గ్రామం వరకు నడపాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 31ఎ నంబరు సిటీ ఆర్టీసీ బస్సు ఆటోనగర్ నుంచి నున్న గ్రామం వరకు ఉదయం ఒక ట్రిప్, సాయంత్రం ఒక ట్రిప్ మాత్రమే నడుస్తుండటం వలన గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోజు వారీ ప్రైవేటు కంపెనీలు, బట్టలషాపులు, మార్కెట్లకు, ఉద్యోగాల కోసం వెళ్లే వారు ఆటోల్లో వెళ్లడం వలన అధికంగా చార్జీలను చెల్లించాల్సి వస్తోందంటున్నారు. కనీసం రూ.40 వంతున ఆటోలకు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో బస్‌పాస్ సదుపాయం ఉంటుందని, జక్కంపూడి వైఎస్సార్ కాలనీ వరకు నడిచే బస్సులను పి.నైనవరం గ్రామం వరకు నడపాలని కోరుతున్నారు.